బీజేపీ ఖాతాలోకి నిందితుడి సొమ్ము!

మద్యం పాలసీ కేసులో నడ్డాను అరెస్ట్ చేస్తారా: ఆతిశీ

న్యూఢిల్లీ, మార్చి 23: మద్యం పాలసీ కేసు నిందితుడి డబ్బు బీజేపీ ఖాతాలోకి వెళ్లిందని ఆప్ ఆరోపించింది. మద్యం పాలసీ కేసులో అరబిందో ఫార్మాకు చెందిన శరత్‌చంద్రా రెడ్డి అరెస్టయి జైల్లో ఉన్నారని.. అతని ఫార్మా కంపెనీ కొన్ని కోట్ల రూపాయల ఎన్నికల బాండ్లను బీజేపీకి ఇచ్చిందని.. మరి అలాంటప్పుడు ఓ నిందితుడి సొమ్ము పార్టీ ఖాతాలో వేసుకున్నందుకు ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను కూడా అరెస్ట్ చేస్తారా అని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత ఆతిశీ ప్రశ్నించారు. శరత్‌చంద్రా రెడ్డి వాంగ్మూలం ఆధారంగానే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని ఆతిశీ తెలిపారు. అయితే అరెస్ట్‌కు ముందు శరత్ చంద్రా రెడ్డి తానెప్పుడూ అరవింద్ కేజ్రీవాల్‌ను కలవలేదని, ఆప్‌తో తనకెలాంటి సంబంధం లేదని చాలా స్పష్టంగా చెప్పాడని ఆతిశీ పేర్కొన్నారు. జైలుకెళ్లాక ఆయన అప్రూవర్‌గా మారి స్టేట్‌మెంట్ ఇవ్వడంపై ఆమె సందేహం వ్యక్తం చేశారు.

'జైల్లో కేజ్రీవాల్ ఆఫీసుకు అనుమతి కోరుతాం'

న్యూఢిల్లీ, మార్చి 23 : కేజ్రీవాల్ జైలు నుంచే ఢిల్లీ సీఎంగా పాలన చేస్తారని, ఇందు కోసం జైల్లో కార్యాలయం ఏర్పాటుకు సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు నుంచి అనుమతి తీసుకొంటామని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ చెప్పారు. 'జైలు నుంచి పరిపాలన చేయకూడదని ఎక్కడా చెప్పలేదు. జైలు కెళ్లినంత మాత్రాన నేరస్థుడు కాదని చట్టం చెబుతున్నది' అని పేర్కొన్నారు. ఆప్‌లో కేజ్రీవాల్ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని మాన్ అన్నారు.

ఆప్ ఎమ్మెల్యే ఇంట్లో ఐటీ సోదాలు

న్యూఢిల్లీ, మార్చి 23: పన్ను ఎగవేశారన్న ఆరోపణలతో ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యే గులాబ్‌సింగ్ యాదవ్‌తో పాటు మరికొందరి ఇండ్లలో ఐటీ శాఖ శనివారం సోదాలు నిర్వహించింది. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గులాబ్‌సింగ్ యాదవ్ మటియాలా నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. పన్ను ఎగవేశారన్న అభియోగంపై విచారణలో భాగంగా ఢిల్లీలోని ఘుమ్మన్‌హెడ గ్రామంలోని ఆప్ ఎమ్మెల్యే ఇంట్లో ఐటీ దాడులు జరిగాయి.

ఎన్నికల ప్రక్రియలో నా జోక్యం ఉండదు

స్పష్టం చేసిన బెంగాల్ గవర్నర్

కోల్‌కతా: లోక్ సభ ఎన్నికల ప్రక్రియలో తన జోక్యం ఎంతమాత్రం ఉండబోదని బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో వేలు పెడుతున్నట్టు తనపై అధికార టీఎంసీ చేసిన ఆరోపణలను ఆయన శనివారం ఖండించారు. ఏ రాజకీయ పార్టీకైనా గవర్నర్ సహా ఏ వ్యక్తిపైనైనా చర్య తీసుకొమ్మని ఫిర్యాదు చేసే స్వేచ్ఛ ఉందని అన్నారు. గత పంచాయతీ ఎన్నికలలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ వీధులలో పర్యటించానని, ఇప్పుడు కూడా ప్రజలకు ఇబ్బందులు ఏర్పడితే వారికి అందుబాటులో ఉంటానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో గవర్నర్ అక్రమంగా జోక్యం చేసుకుంటున్నారని, ఈసీ మాదిరిగా సమాంతర కార్యాలయాన్ని నడపడానికి ప్రయత్నిస్తున్నారని టీఎంసీ శుక్రవారం ఈసీకి ఫిర్యాదు చేసింది.

ఐరాస ముందు పీవోకే వాసుల నిరసన

పాక్ బలగాలు వైదొలగాలని డిమాండ్

జెనీవా, మార్చి 23: పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిట్ – బల్తిస్థాన్‌లో పాకిస్థాన్ బలగాలు వైదొలగాలని డిమాండ్ చేస్తూ జెనీవాలోని ఐరాస కార్యాలయం ముందు ఆయా ప్రాంతాల వాసులు నిరసన తెలిపారు. నేషనల్ ఈక్వాలిటీ పార్టీ జేకేజీబీఎల్ ఆధ్వర్యంలో ఐరాస మానవ హక్కుల మండలి 55వ సమావేశం జరుగుతుండగా నిరసన జరిగింది. ఐరాస భద్రతా మండలి తీర్మానం మేరకు పాక్ బలగాలు వైదొలగాలని వీరు డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా బ్యానర్లు ప్రదర్శించారు. ప్రజలకు కనీస మానవ హక్కులు లేవని, ఈ విషయంలో పాకిస్థాన్‌ను నియంత్రించడంలో ఐరాస విఫలమవుతున్నదని ఆ పార్టీ నేత రజా పేర్కొన్నారు.

త్వరలోనే బయటకొస్తా!

నన్ను ఎక్కువ కాలం బంధించే జైలు లేదు

- అరెస్టు ఊహించిందే.. భవిష్యత్తులోనూ సవాళ్లే
- దేశంలో 'దుష్ట' శక్తులను గుర్తించి ఓడించాలి
- బీజేపీ వాళ్లు మన సోదర సోదరీమణులు.. నన్ను అరెస్ట్ చేశారని వారిపై ద్వేషం చూపొద్దు
- కేజ్రీవాల్ సందేశాన్ని వినిపించిన సునీత
- విచారణ పారదర్శకంగా జరగాలన్న జర్మనీ

న్యూఢిల్లీ, మార్చి 23: తనను ఎక్కువ కాలం బంధించే జైలే లేదని, త్వరలో తప్పకుండా బయటకు వస్తానని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ సందేశాన్ని ఆయన భార్య సునీత శనివారం ఒక వీడియోలో చదివి వినిపించారు. తన అరెస్టు ఆశ్చర్యం కలిగించలేదని పేర్కొన్న కేజ్రీవాల్.. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చేందుకు త్వరలో తాను బయటకు వస్తానని పేర్కొన్నారు. తాను లోపల ఉన్నా, బయట ఉన్నా.. తన జీవితంలోని ప్రతిక్షణం దేశ సేవకే అంకితమని భావోద్వేగ సందేశం ఇచ్చారు. 'మీ సోదరుడు, కొడుకుని సుదీర్ఘకాలం బంధించే జైలే లేదు. త్వరలో నేను బయటకు వస్తాను, హామీలను పూర్తిచేస్తాను' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాను పోరాటాలు చేయడానికే పుట్టానని, భవిష్యత్తులో కూడా పెద్ద సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకే తన అరెస్టు ఆశ్చర్యం కలిగించలేదని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

కేజ్రీవాల్ సందేశాన్ని చదివి వినిపిస్తున్న ఆయన భార్య సునీత

దేశాభివృద్ధికి అందరం ఏకం కావాలి

ప్రజలందరూ కలిసి భారతదేశాన్ని ప్రపంచంలోనే బలమైన, గొప్పదైన అగ్ర దేశంగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఉన్నదని కేజ్రీవాల్ నొక్కిచెప్పారు. 'దేశాన్ని బలహీనపరిచే శక్తులు దేశం లోపల బయట ఎన్నో ఉన్నాయి. మనం వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఆ శక్తులను గుర్తించి ఓడించాలి' అని ప్రజలకు పిలుపునిచ్చారు. 'దేశంలో ఎందరో దేశభక్తులు, శక్తులు ఉన్నాయి. భారతదేశం ముందుకు సాగేలా చేయాలి. ఈ శక్తులన్నీ ఐక్యమై బలోపేతం కావాలి' అని కేజ్రీవాల్ తన సందేశంలో ఆకాంక్షించారు. తాను కస్టడీలో ఉన్నానన్న ఆందోళనతో ప్రజా, సామాజిక సేవ చేయడం ఆపొద్దని ఆయన ఆప్ కార్యకర్తలను కోరారు. ఇదే సమయంలో బీజేపీ నేతలను తన సోదర సోదరీమణులుగా సంబోధించిన కేజ్రీవాల్.. తన అరెస్టుపై వారిపై ద్వేషం చూపొద్దని సూచించారు.

జర్మనీ స్పందనను ఖండించిన భారత్

కేజ్రీవాల్ అరెస్టుపై జర్మనీ స్పందించింది. 'భారత్ ఒక ప్రజాస్వామ్య దేశం. న్యాయవ్యవస్థ స్వతంత్రత, ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రాలకు సంబంధించిన ప్రమాణాలు ఈ కేసులో కూడా వర్తిస్తాయని ఆశిస్తున్నాం. ఇతరులలానే ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌పై పారదర్శక, నిష్పక్షపాత విచారణకు అర్హులు. అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన అవకాశాలను ఎలాంటి పరిమితులు లేకుండా ఆయన వినియోగించుకోవచ్చు. తాను ఎటువంటి తప్పు చేయలేదని నిరూపించుకోవడం అనేది న్యాయప్రకారంగా చాలా ముఖ్యమైన అంశం. దీన్ని ఆయనకు కూడా వర్తింపజేయాలి' అభిప్రాయపడ్డారు. కాగా, జర్మనీ విదేశాంగ శాఖ స్పందనపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఢిల్లీలోని జర్మనీ రాయబారి జార్జ్ ఎంజ్‌వీలర్‌కు విదేశాంగ శాఖ సమన్లు ఇచ్చింది. భారత అంతర్గత వ్యవహారాలపై జోక్యం చేసుకోవడంపై నిరసన తెలియజేశామని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

కస్టడీపై ఢిల్లీ హైకోర్టులో సవాల్.. వచ్చే వారం విచారణ

ఈడీ కస్టడీని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ శనివారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తనపై పిటిషన్‌పై అత్యవసరంగా ఈ నెల 24(ఆదివారం) విచారణ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. తన అరెస్టు, రిమాండ్ రెండూ అక్రమమని, కస్టడీ నుంచి వెంటనే విడుదల కావడానికి తాను అర్హుడనని పేర్కొన్నారు. అయితే ఈ పిటిషన్‌ను ఈ నెల 27న విచారణ చేస్తామని కోర్టు బదులిచ్చింది. మరోవైపు కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో ఢిల్లీ ఏసీపీ ఏకే సింగ్ తనతో దురుసుగా ప్రవర్తించారని కేజ్రీవాల్ ఆరోపించారు. గతంలో మనీశ్ సిసోడియా పట్ల కూడా కోర్టు ప్రాంగణంలో ఆయన ఇదే విధంగా వ్యవహరించాడని, తన భద్రతా దృష్ట్యా ఆ అధికారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని కోరుతూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో అప్లికేషన్ దాఖలు చేశారు.

ఎన్నికల వేళ ఆప్ ఆఫీసుకు తాళమెలా వేస్తారు?

లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరాచకంగా ప్రవర్తిస్తున్నదని ఢిల్లీ ఆప్ మంత్రులు ఆతిశీ, సౌరవ్ భరద్వాజ్ మండిపడ్డారు. ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడానికి వ్యతిరేకంగా శుక్రవారం ఆప్ కార్యకర్తల ఆందోళన నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీ డీడీయూ మార్గ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన కార్యాలయాన్ని పోలీసులు మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తమ పార్టీ కార్యాలయాన్ని అన్నివైపులా నుంచి మూసివేయించిందని, దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని మంత్రి ఆతిశీ శనివారం ఎక్స్ పోస్టులో వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కార్యాలయాన్ని మూసివేయడం ద్వారా ఒక జాతీయ పార్టీ కార్యకలాపాలను ఏ విధంగా అడ్డుకొంటారని ఆమె ప్రశ్నించారు.

రాజీనామా చేయాలని ఏ చట్టం చెప్పలేదు

ఢిల్లీ ప్రభుత్వం చట్టప్రకారమే నడుస్తుందని, రాజకీయ ప్రతీకారం వల్ల జైలుకు వెళ్లిన సీఎం రాజీనామా చేయాలని ఏ చట్టం చెప్పడం లేదని భగవంత్ మాన్ ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో మాత్రమే ఉన్నారని, ఆయనను దోషిగా తేల్చలేదని పేర్కొన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందనే విషయంపై అన్ని అంతర్జాతీయ పత్రికలు తమ మొదటి పేజీల్లో రాశాయని తెలిపారు. 'మన దేశంలో ప్రతిపక్ష నేతలను జైల్లో పెడుతున్న వాళ్లు.. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడం గురించి మాట్లాడుతారు' అని ప్రధాని మోదీ, బీజేపీ నేతలను ఉద్దేశించి మాన్ వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్ త్వరలో విడుదల అవుతారు: మాన్

ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ త్వరలో విడుదల అవుతారని, దేశంలో విప్లవం తీసుకొస్తారని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అన్నారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అమరవీరుల దినం సందర్భంగా మాన్‌తోపాటు పలువురు ఢిల్లీ మంత్రులు శనివారం స్థానిక షాహీదీ పార్క్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాన్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ దేశంలో నియంతృత్వాన్ని నెలకొల్పాలని చూస్తున్నదని ఆరోపించారు.

ఇప్పుడు టార్గెట్ మహువా!

- టీఎంసీ మాజీ ఎంపీ ఆఫీసుల్లో సీబీఐ తనిఖీలు
- ఫెమా రూల్స్ ఉల్లంఘన పేరిట ఈడీ సమన్లు
- ప్రశ్నించే గొంతుకలను అణచేందుకు బీజేపీ యత్నం!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): మొన్న బీఆర్ఎస్, నిన్న ఆప్, ఇప్పుడు టీఎంసీ.. ఎన్నికల వేళ విపక్షాలను లక్ష్యంగా చేసుకుని కేంద్రంలోని బీజేపీ చెలరేగి పోతున్నది. బీజేపీ సర్కారు వైఫల్యాలను, కార్పొరేట్లకు దోచిపెడుతున్న విధానాలను పార్లమెంట్‌లో ఎప్పటికప్పుడు ఎండగట్టిన తృణమూల్ కాంగ్రెస్‌ను బీజేపీ టార్గెట్ చేసింది. ఆ పార్టీ నేత, మాజీ ఎంపీ మహువా మొయిత్రా ఇంటిపై సీబీఐ దాడులు నిర్వహించింది. పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణల కేసులో శనివారం పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మహువా నివాసంతో పాటు ఇతర నగరాల్లో ఆమెకు చెందిన కార్యాలయాల్లో అధికారులు ముమ్మర తనిఖీలు చేశారు. మహువాపై దర్యాప్తు చేపట్టి ఆరు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని సీబీఐని లోక్‌పాల్ ఆదేశించిన నేపథ్యంలో గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ తాజాగా మహువా ఇంట్లో సోదాలు నిర్వహించింది. మరోవైపు, ఇదే వ్యవహారానికి సంబంధించి విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘన కేసులో ఈడీ ఆమెకు ఇటీవలే సమన్లు జారీ చేసింది.

ఇవి ప్రతీకార రాజకీయాలే

కేంద్రంలోని బీజేపీ తమపై ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని బెంగాల్‌లోని అధికార టీఎంసీ మండిపడింది. దేశంలో నెలకొన్న పలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కేంద్రం ఈ దాడులు జరుపుతున్నదని, రాజకీయ ప్రతీ కారానికి సీబీఐ దాడులే ప్రత్యక్ష నిదర్శనమని ఆ పార్టీ నేత శంతన్ సేన్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలను దెబ్బతీయడమే బీజేపీ లక్ష్యంగా కనిపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

3-6 తరగతులకు సీబీఎస్ఈ కొత్త సిలబస్

న్యూఢిల్లీ : ఎన్‌సీఈఆర్‌టీ 2024–25 విద్యా సంవత్సరానికి 3 నుంచి 6 తరగతులకు నూతన సిలబస్‌ను, టెక్స్ట్‌బుక్స్‌ను విడుదల చేస్తుందని సీబీఎస్ఈ అధికారులు తెలిపారు. ఇతర తరగతుల సిలబస్, పాఠ్య పుస్తకాల్లో ఈ విద్యా సంవత్సరానికి ఎటువంటి మార్పులు లేవని చెప్పారు. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) తన అనుబంధ పాఠశాలలకు సమాచారాన్ని పంపినట్లు చెప్పారు. 3, 6 తరగతులకు బ్రిడ్జ్ కోర్సులను కూడా రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ నుంచి ఇవి వచ్చిన తర్వాత అన్ని పాఠశాలలకు ఆన్‌లైన్ ద్వారా అందజేయనున్నట్లు చెప్పారు.

బెంగాల్‌లో ముగిసిన ఈడీ దాడులు

40 లక్షల నగదు స్వాధీనం

కోల్‌కతా: బెంగాల్ మంత్రి చంద్రనాథ్ సిన్హా ఇంటిపై చేసిన సోదాల్లో రూ.40 లక్షల నగదు, పలు ఆస్తి పత్రాలు, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు శనివారం తెలిపారు. టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్ కేసుకు సంబంధించి బీర్‌భూమ్ జిల్లా బోల్పూర్‌లోని మంత్రి నివాసంలో శుక్రవారం ఈడీ సోదాలు జరిపింది.

మంత్రి సోదరుడి కేసులోనూ....

మరోవైపు బెంగాల్ మంత్రి అరూప్ బిశ్వాస్ సోదరుడు, టీఎంసీ నేత స్వరూప్ బిశ్వాస్‌కు చెందిన ప్రాంగణాలలో ఐటీ శాఖ దాడులు శనివారం ముగిశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు, పన్ను ఎగవేత, తదితర ఆరోపణలతో బుధవారం సోదాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 4న విచారణకు రావాలని స్వరూప్‌కు ఐటీ అధికారులు నోటీసులు ఇచ్చారు.

పంజాబ్ మద్యం పాలసీపైనా

విచారణ జరిపించండి

ఎన్నికల సంఘాన్ని కోరిన బీజేపీ

చండీగఢ్, మార్చి 23: ఆమ్ ఆద్మీ పార్టీ నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం పాలసీపై విచారణ జరిపించాలని ఆ రాష్ట్ర బీజేపీ శాఖ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ఢిల్లీ మద్యం పాలసీ తరహాలోనే పంజాబ్ విధానాన్ని రూపొందించారని తెలిపింది. పంజాబ్ ఎక్సైజ్ పాలసీపై ఈడీ దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పంజాబ్ బీజేపీ చీఫ్ సునీల్ జాఖర్ ఆధ్వర్యంలోని ఓ ప్రతినిధి బృందం శనివారం రాష్ట్ర ఎన్నికల అధికారికి మెమొరాండం సమర్పించింది. మే 2022లో పంజాబ్ ఎక్సైజ్ పాలసీని రూపొందించారని జాఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అరెస్టయిన అప్పటి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో జరిగిన సమావేశానికి పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమాతో పాటు ఇద్దరు సీనియర్ అధికారులు హాజరయ్యారని జాఖర్ ఆరోపించారు. భగవంత్ మాన్ ప్రభుత్వం పంజాబ్ వనరులను అధికారికంగా కొల్లగొట్టిందని ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రం సుమారు వెయ్యి కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే రాష్ట్ర ఎక్సైజ్ పాలసీ కారణంగా ఏడాదిలో ప్రభుత్వ ఆదాయం రూ.6 వేల కోట్ల నుంచి ఏకంగా రూ.10 వేల కోట్లకు పెరిగిందని జఖర్‌పై ఆప్ పంజాబ్ యూనిట్ ముఖ్య అధికార ప్రతినిధి మల్విందర్ కాంగ్ మండిపడ్డారు.

బీజేపీతో టచ్‌లో శివకుమార్!

- 40 మంది ఎమ్మెల్యేలతో మా పార్టీలో చేరేందుకు సిద్ధం!
- కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న సంచలన వ్యాఖ్యలు

బెంగళూరు, మార్చి 23: కర్ణాటక మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న శనివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ 40 మంది ఎమ్మెల్యేలతో కలిసి తమ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఒకవేళ బీజేపీ గనుక గేట్లు తెరిస్తే.. బీజేపీలో చేరేందుకు ఆయన ఇప్పటికే రంగం సిద్ధం చేసుకొన్నారంటూ ఎమ్మెల్యే మునిరత్న చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారాయి. అయితే శివకుమార్‌ను పార్టీలోకి తీసుకొనేందుకు తమ పార్టీ నేతలు సుముఖంగా లేరని ఆయన చెప్పుకొచ్చారు. 'బీజేపీ నేతలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని శివకుమార్ పైకి చెబుతున్నారు. అయితే వాస్తవం ఏంటంటే, తన అనుచరులతో కలిసి ఆయనే బీజేపీలోకి చేరేందుకు రెడీగా ఉన్నారు' అని మునిరత్న పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో మరో నాలుగు డిప్యూటీ ముఖ్యమంత్రుల పోస్టులు సృష్టించాలనే డిమాండ్ ఉన్నదని, ఈ ప్రతిపాదనలపై అసంతృప్తిగా ఉన్న డీకే శివకుమార్ కాంగ్రెస్‌లో ఉండటం కంటే, బీజేపీలోకి వెళ్లడం మేలనే భావనలో ఉన్నారని ఆయన అన్నారు.

ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు 50 కోట్లు ఆఫర్: సిద్ధరామయ్య

బీజేపీపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలను పావులుగా వాడుకోవాలని బీజేపీ కుట్రలు పన్నుతున్నదని, ఇందుకోసం ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఆ పార్టీ రూ.50 కోట్లు ఆఫర్ చేసిందని ఆరోపించారు. బెంగళూరులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ రణదీప్ సూర్జేవాలాతో కలిసి ఆయన పాల్గొన్నారు. అవినీతికి 'పితామహులు' బీజేపీ నాయకులని, దేశంలో ప్రజాస్వామ్య విధానాలను, పార్లమెంట్ వ్యవస్థను వారు ధ్వంసం చేస్తున్నన్నారని సిద్ధరామయ్య మండిపడ్డారు. 'కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ప్రభుత్వాన్ని కూల్చాలన్నది బీజేపీ ప్లాన్. డబ్బుతోపాటు రాజీనామా చేసిన తర్వాత వచ్చే ఉప ఎన్నికలకు అయ్యే ఖర్చును కూడా తామే భరిస్తామని హామీ ఇస్తున్నది. ఇదంతా చేయడానికి బీజేపీకి కొన్ని వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఇది నల్ల డబ్బు కాదా?' అని ఆయన ప్రశ్నించారు. డీకే శివకుమార్ మాట్లాడుతూ తమ పార్టీ విరాళాల డబ్బును ఐటీ విభాగం స్తంభింపజేయడం ద్వారా ప్రతిపక్ష పార్టీలను మోదీ సర్కార్ టార్గెట్ చేసిందని ఆరోపించారు.

'సింధూరం' హిందూ వివాహిత బాధ్యత

విడాకుల కేసులో ఇండోర్ కోర్టు తీర్పు

ఇండోర్, మార్చి 23: సింధూరం (బొట్టు) పెట్టుకోవడం హిందూ వివాహిత బాధ్యత అని, అది పెట్టుకుంటే వివాహితగా తెలుస్తుందని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఫ్యామిలీ కోర్టు పేర్కొన్నది. ఇండోర్‌కు చెందిన దంపతులకు 2017లో వివాహం జరిగింది. వారికి ఐదేండ్ల కుమారుడు ఉన్నాడు. అయితే ఐదేండ్ల క్రితం తన భార్య తనను వదిలి వెళ్లిందని, ఆమె మళ్లీ తనతో కలిసి ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని భర్త కోర్టుకెక్కాడు. ఈ పిటిషన్‌ను విచారించిన ఇండోర్ ఫ్యామిలీ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి ఎన్‌పీ సింగ్.. 'మహిళ కోర్టులో స్టేట్‌మెంట్ ఇచ్చినప్పుడు సింధూరం పెట్టుకోవడం లేదని చెప్పింది. సింధూరం పెట్టుకోవడం హిందూ వివాహిత బాధ్యత. భర్త ఆమెను విడిచిపెట్టలేదు. ఆమే భర్తను విడిచిపెట్టింది. తన భర్త కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఆమె ఆరోపించినప్పటికీ ఇందుకు ఆధారాలు లేవు. పోలీసులకు ఆమె ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. కాబట్టి, మహిళ వెంటనే తన భర్త ఇంటికి తిరిగి వెళ్లాలి' అని తీర్పు చెప్పారు.

రాష్ట్రపతిపై సుప్రీంకోర్టులో పిటిషన్

- కేరళ సర్కారు అసాధారణ చర్య
- బిల్లుల ఆమోదంపై రెండేండ్లుగా జాప్యం చేస్తున్నారని ఆరోపణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): కేరళలోని పినరయి విజయన్ సర్కారు అ సాధారణ చర్యకు దిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వ్యతిరేకంగా శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా రాష్ట్రపతి జాప్యం చేస్తున్నారని, అందుకుగల కారణాలనైనా వివరించడం లేదని ఆరోపించింది. యూనివర్సిటీల చట్టం సవరణ బిల్లు సహా మొత్తం నాలుగు బిల్లులు రాష్ట్రపతి దగ్గరే రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపింది. వీటిలో మొత్తం ఏడు బిల్లుల్లో నాలుగు బిల్లులను రాష్ట్రపతికి పంపించారని, అక్కడ కూడా జాప్యమే జరుగుతున్నదని తెలిపింది. ఈ విధంగా బిల్లులను తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరింది.

నిధులు లేకుంటే పార్టీలను నడపలేం: నితిన్

అహ్మదాబాద్, మార్చి 23: ఏ రాజకీయ పార్టీ అయినా నిధులు లేకుండా మనుగడ సాగించలేదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎన్నికల బాండ్లపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీం కోర్టు ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని ఇప్పుడు కొట్టేసింది కానీ.. ఈ పథకాన్ని కేంద్రం సదుద్దేశంతోనే తీసుకొచ్చిందని గడ్కరీ ప్రభుత్వాన్ని వెనకేసుకొచ్చారు. ఒక వేళ ఏవైనా లోటుపాట్లు ఉన్నట్టు గుర్తిస్తే.. వాటిపై అన్ని పార్టీలు కలిసి చర్చించి సరిదిద్దుకుంటే సరిపోతుందన్నారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీం కోర్టు రద్దు చేసిన సంగతి విదితమే.

మాస్కోలో భీకర ఉగ్ర దాడి

143 మంది మృతి.. 140 మందికి గాయాలు

- ఉక్రెయిన్‌పై రష్యా ఆరోపణలు
- దాడి చేసింది మేమే: ఐఎస్ ప్రకటన

మాస్కో, మార్చి 23: రష్యా రాజధాని మాస్కోలో భీకర ఉగ్రదాడి జరిగింది. ఓ సంగీత కచేరీలో పాల్గొన్న ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులు విచ్చలవిడిగా కాల్పులకు తెగబడ్డారు. కాల్పుల అనంతరం హాల్‌కు నిప్పు పెట్టి పారిపోయారు. ఈ ఘోర దాడిలో దాదాపుగా 143 మంది కన్నుమూయగా, 140 వరకు గాయపడి చికిత్స పొందుతున్నారు. మాస్కోలోని క్రాస్నోగోర్స్క్ ప్రాంతంలో ఉన్న క్రాకస్ సిటీ హాల్‌లో శుక్రవారం రాత్రి ఓ సంగీత కచేరీ జరిగింది. 'పిక్‌నిక్' అనే రాక్ బ్యాండ్ బృందం ఈ కచేరీ చేపట్టింది. హాల్ మొత్తం కిక్కిరి సి ఉన్న వేళ నలుగురు ఉగ్రవాదులు ఆటోమెటిక్ ఆయుధాలతో హాల్‌లోకి ప్రవేశించారు. వస్తూనే వేదిక వద్ద నుంచి విచ్చలవిడిగా కాల్పులకు తెగబడ్డారు. బాంబులు విసిరారు.కంటికి కనిపించిన వారందరిపై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. కాల్పుల అనంతరం ఇంధనం చల్లి హాల్‌కు నిప్పు పెట్టి పారిపోయారు. మంటల కారణంగా ప్రాణనష్టం పెరిగింది.

ఉగ్రదాడి ఘటన మృతులకు నివాళి అర్పిస్తున్న రష్యన్లు

పట్టుబడ్డ ఉగ్రవాదులు!

కాల్పులకు పాల్పడ్డ నలుగురి సహా 11 మంది అనుమానితులను రష్యా భద్రత సంస్థ ఎఫ్ఎస్‌బీ అదుపులోకి తీసుకుంది. కాగా, ఉగ్రవాదులకు ఉక్రెయిన్‌లో కాంటాక్టులు ఉన్నాయని రష్యా ఆరోపించగా, దాడికి పాల్పడింది తామేనని ఇస్లామిక్ స్టేట్ ప్రకటించింది.

పేగులో పొడవు చేప.. సజీవంగా బయటకు..

న్యూఢిల్లీ: ఒక వ్యక్తి పెద్ద పేగులో నుంచి వైద్యులు బతికి ఉన్న పెద్ద చేపను బయటికి తీశారు. వియత్నాంలోని ఉత్తర క్వాంగ్‌నిన్హ్ ప్రావిన్స్‌కు చెందిన ఓ వ్యక్తి (34)కి ఈ అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న ఆయనను జిల్లా మెడికల్ సెంటర్ వైద్యులు ప్రాణాపాయం నుంచి తప్పించారు. శస్త్ర చికిత్స చేసి సుమారు 30 సెంటీమీటర్ల పొడవైన మలుగు చేపను బయటకు తీశారు. మల ద్వారం గుండా కడుపులోకి ప్రవేశించి ఉండవచ్చునని వైద్యులు భావిస్తున్నారు. బయటపడిన తర్వాత కూడా ఈ మలుగు చేప బతికి ఉండటం చూసి వైద్యులు ఆశ్చర్యపోయారు.

సీఎంతో సంప్రదించాకే గవర్నర్ల నియామకం

మ్యానిఫెస్టోలో ఏఐఏడీఎంకే హామీ

న్యూఢిల్లీ, మార్చి 23: రాష్ట్రాలకు గవర్నర్లను నియమించే సమయంలో ముఖ్యమంత్రులతో సంప్రదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని ఏఐఏడీఎంకే తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అలాగే 'నీట్' పరీక్షను రద్దు చేస్తామని, వైద్య విద్యార్థుల ఎంపిక కోసం ప్రత్యామ్నాయ ప్రక్రియను చేపడతామని కూడా ఆ పార్టీ హామీ ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మాజీ సీఎం, ఏఐఏడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిస్వామి పార్టీ మ్యానిఫెస్టోని చెన్నైలో విడుదల చేశారు. సుప్రీంకోర్టు బెంచ్‌ను చెన్నైలో ఏర్పాటుచేస్తామని, భారత్‌లో నివసిస్తున్న శ్రీలంక శరణార్థులకు ద్వంద్వ పౌరసత్వం జారీ చేస్తామని..ఇలా 113 హామీలను ఓటర్ల ముందుంచింది. దాదాపు ఇవే అంశాలతో డీఎంకే మ్యానిఫెస్టోను ఇటీవల విడుదల చేసింది.